ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు

సోమవారం 17 నవంబరు 2025 | 5

ఆరోగ్య ప్రదాత ధన్వంతరి

» చింతలూరులో కొలువైన స్వామివారు

» నేడు జయంతి సందర్భంగా పూజలు

7



ఎనీవేర్.. అవినీతి!

కరప్షన్‌కింగ్‌లు..రిజిస్ట్రార్లు

కొందరు మారరంతే.. మామూళ్ల మత్తులో జోగుతారు.. తప్పయినా ధైర్యంగా చేసేస్తారు. ఏదైనా సరే వీళ్ల నోటి నుంచి వచ్చే మాట.. నాకేంటి..!? ఎందుకంటే చేయి తడిపితేనే కానీ పెన్ను కదపరు.. చేయి తడపలేదంటే ఏదో వంక పెడతారు.. చేయాల్సిన పని ఆపేస్తారు.. నెలల తరబడి తిప్పుకుంటారు.. రోజుకు తక్కువంటే రూ.50 వేలపైనే వెనకేస్తారు.. ఇంతకీ మారనిది ఎవరంటారా.. సబ్‌రిజిస్ట్రార్లు.. నిత్యం మామూళ్ల మత్తులో జోగేది వీళ్లే మరి..

తూర్పుగోదావరి జిల్లాలోని ఒక గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి అమ్మాయిలు మాత్రమే ఉండడంతో ఒక అబ్బాయిని దత్తత తీసుకున్నా డు. కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి.. ఆస్తి మొత్తం దత్తపుత్రుడికి రాసిచ్చేశాడు. ఆ తర్వాత అతను చనిపోయాడు. తండ్రి గిఫ్ట్‌గా ఏదైనా ఆస్తి రిజిస్ట్రేషన్ చేసి చనిపోతే అది రద్దు చేసే అధికారం ఉండదు. కానీ ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేసేశారు. ఇది ఎలా జరిగిందనేది అందరికీ ఆశ్చర్యమే. ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌లో లొసుగుల వల్ల ఇటువంటి తప్పులు జరుగుతున్నాయి.

గత వైసీపీ హయాంలో గోపాలపురంలో ప్రభుత్వానికి, ప్రైవేట్ వ్యక్తుల మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమిని వైసీపీ నేతలు తక్కువ ధరకు కొనుగోలు చేసి కొవ్వూరు, కోరుకొండ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవడమేగాకుండా డబుల్ రిజిస్ట్రేషన్లు చేసేశారు. సర్వే నెంబర్ ముందు ఏదో ఒక అక్షరం పెట్టి కానిచ్చేశారు. ఉదాహరణకు సర్వే నెంబర్ 11/1 ఉంటే ఆ పేరుతో అప్పటికే రిజిస్ట్రేషన్ అయితే సర్వే నెంబర్ 11/1ఎ అని మార్చి డబుల్ రిజిస్ట్రేషన్లు చేసేశారు. డాక్యుమెంట్ రైటర్ నుంచి మొదలుపెట్టి సబ్‌రిజిస్ట్రార్ వరకూ మామూళ్లు ఇచ్చుకుంటూ మనది కాని ఆస్తి కూడా ఇవాళ మనదైపోతోంది. రాజమహేంద్రవరం భాస్కర్‌నగర్‌లో ఇటువంటి రిజిస్ట్రేషన్లు కోకొల్లలు..

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌లుగా మారిపోయాయి. మామూళ్ల లేనిదే పనిజరగని ప్రభుత్వ కార్యాలయం ఏదైనా ఉందంటే అది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమే. అయినా మన ఏసీబీ అధికారులకు ఎందుకో కనబడదు. ఎందుకంటే అక్కడ అవినీతి ఉండడంతో కళ్లెదుటే అవినీతి జరుగుతున్నా పట్టించుకోరు. కనీసం కన్నెత్తి చూసే ధైర్యమూ చేయరు. జిల్లా కేంద్రాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ప్రతిరోజూ సబ్ రిజిస్ట్రార్ రూ.లక్షపైనే అద నంగా ఇంటికి తీసుకెళతాడనేది ఒక ఉద్యోగి చెప్పిన మాట. అయినా ఏసీబీ అధికారులకు పట్టదు. జిల్లా కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్లు చాలా తెలివిగా ఉంటారు. ఏ రూపాయి వారి వద్ద పెట్టుకోరు. వారికి బ్రోకర్లు ఉంటారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లు తెచ్చే లేఖరితో ఎక్కువ మంతనాలు సాగిస్తారు. వారు ఏం చెబితే అది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగి తీరుతుందంతే.

మామూళ్లు.. మామూలే..

రిజిస్ట్రేషన్ ఏదైనా సరే మామూళ్లు ఇవ్వాల్సిందే. కేవలం భూములు కొనుగోలు, అమ్మకాల రిజిస్ట్రేషన్లే కాదు. గిఫ్ట్, తనఖా, పూర్వపు ఆస్తి పంపకాలు, మ్యారేజి రిజిస్ట్రేషన్లు, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ, సేల్ అగ్రిమెంట్ కమ్ జీపీ, లీజ్ డీడ్, వీలునామా, చెల్లు రశీదులు ఇలా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అనేక లావాదేవీలు జరుగుతుంటాయి. ఏ రిజిస్ట్రేషన్ అయినా చేయి తడపాల్సిందే. రిజిస్ట్రేషన్లు ఆన్‌లైన్ అయిన తర్వాత అవినీతి తగ్గిపోతుందని అందరూ అనుకున్నారు. ప్రభుత్వాలు విస్తృత ప్రచారం చేశాయి. కానీ ఎక్కడా తగ్గలేదు. సబ్‌రిజిస్ట్రార్‌తోపాటు, ఆఫీసులో పని చేసేవారందరికీ మామూళ్లు ఇవ్వవలసిందే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతిలో మునిగితేలుతున్నాయి.

» సబ్ రిజిస్ట్రార్‌కు మామూళ్లు చెల్లించాల్సిందే

» ఒక్కో రిజిస్ట్రేషన్‌కు 2 శాతం లేదా 3 శాతం

» ఏదైనా తప్పు దొర్లితే మూమూళ్లు అధనమే

» ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెరిగిన దోపిడీ

» రోజూ అధనంగా లక్షలు.. వేలు

» అయినా కన్నెత్తి చూడని ఏసీబీ

36 ఆఫీస్‌లు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 36 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో 12, కోనసీమ జిల్లాలో 15, కాకినాడ జిల్లాలో 9 ఉన్నాయి. ప్రతి జిల్లాకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం (డీఆర్) ఉంది. ఒక్కో జిల్లాలో నెలకు 6 వేల నుంచి 7వేల వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. మొత్తం ఉమ్మడి జిల్లాలో నెలకు సుమారు 20వేల వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ప్రతీ దానికీ మామూళ్లే. కాకినాడలో ఈ ఏడాది మార్చిలో జిల్లా రిజిస్ట్రార్ తన అసిస్టెంట్ సహా లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడంటే లంచాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆమ్యామ్యా ఎంతో తెలుసా రూ.12,500. ఈ రేటు ఏం తేడాలేకపోతేనే.. కాగితాల్లో ఏదైనా తేడా ఉందో.. తేడాను బట్టి రేటు ఉంటుంది. అది ఎంతనేది చెప్పడం కష్టమే. అది సబ్ రిజిస్ట్రార్ దయపై ఆధారపడి ఉంటుంది మరి.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ సబ్ రిజిస్ట్రార్ ఒక రేటు ఉంటుంది.. అదే 2 శాతం లేదంటే 3 శాతం.. ఏం తేడా లేకపోతే ప్రతి రిజిస్ట్రేషన్‌కి ఈ మొత్తం చెల్లించాల్సిందే. ఇది లేఖరి దగ్గరే మొదలైపోతోంది. మన తీసుకెళ్లిన ఆస్తిని బట్టి ఎంత ఖర్చవుతుందనేది లేఖరు చెప్పేస్తాడు. రూ.10 లక్షల విలువ కలిగిన ఆస్తి అయితే అన్ని ఖర్చులు కలుపుకుని రూ.లక్ష వరకూ ఖర్చవుతుందని చెబుతాడు. దీనిలో సబ్ రిజిస్ట్రార్ 2 శాతం అంటే రూ.2 వేలు.. లేదంటే 3 శాతం రూ.3 వేలు ఉంటుందన్నమాట. ఇదికాక ఆ ఆఫీస్‌లో పనిచేస్తున్న వారికి రూ.2 వేల వరకూ ఉంటుంది. ఇందులోనూ సబ్‌రిజిస్ట్రార్‌కు వాటా మామూలే. అదికాక లేఖరి ఖర్చులు.. ఇలా అన్నీ కలుపుకుంటే రూ.77,500 అయ్యే ఖర్చును మామూళ్లతో కలిసి రూ.లక్ష చేస్తారు.

అవినీతి జరిగేదిలా..

సాధారణంగా రూ.10 లక్షల విలువ ఉన్న ఆస్తికి రిజిస్ట్రేషన్ చేయించు కోవాలంటే ప్రస్తుత విలువ ప్రకారం రూ.75,500 చలానా కట్టాలి.. డాక్యుమెంట్ రైటర్‌కి రూ.2 వేలు ఇవ్వాలి.. ఇదీ రివాజు. అంటే మొత్తం అంతా కలిపి రూ.77,500 అవుతుంది.. అయితే రూ.10 లక్షల ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే అన్ని ఖర్చులు కలిపి సుమారు రూ.90 వేలు పైనే అవుతుంది. ఎందుకంటే

నిద్దరోతున్న ఏసీబీ..

ఆయా రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులకు కొంత వాటా ఇవ్వాలనే వాదన ఉంది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో ఏసీబీ ఆకస్మిక దాడులు చేసిన సంగతి తెలిసిందే. చాలామంది వద్ద భారీగా అవినీతి సొమ్ము లభ్యమైంది.కానీ ఉమ్మడి గోదావరి జిల్లాలో భయం లేకుండా పోయింది. పలు జిల్లాల్లో దాడులు జరిగిన మర్నాడు ఓ సబ్‌రిజిస్ట్రార్ ఒక రిజి స్ట్రేషన్‌లో తనకు ఎంతిస్తారని నేరుగా అడగడంతో అక్కడున్న వారంతా అవాక్కవడం గమనార్హం. మొత్తం మూడు జిల్లాల్లో రోజూ రూ.లక్షల్లోనే అవినీతి జరుగుతోంది.ఇకనైనా ఏసీబీ అధికారులు ఫోన్ చేయండి పట్టుకుంటాం అన్నట్టు కాకుండా ఆకస్మిక తనిఖీలు చేసినా పట్టుబడతారు.

ప్రైవేటు ట్రావెల్ బస్సులపై ఆర్టీఏ కొరడా

» నిబంధనలు ఉల్లంఘించి నడుపుతున్న బస్సులకు భారీగా జరిమానా

» ట్యాక్సులు ఎగ్గొట్టి నడుపుతున్న గనిశ్రీ బస్సుకు రూ.3.70 లక్షల జరిమానా

» మరో 13 బస్సులకు రూ.3.93 లక్షల అపరాధ రుసుం : డీటీవో శ్రీనివాస్



ఈతకోట చెక్‌పోస్టు వద్ద ఆర్టీఏ అధికారుల తనిఖీలు

అమలాపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి) : రవాణాశాఖ విధించిన నిబంధనలను ఉల్లంఘిస్తూ నడుపుతున్న బస్సులపై రవాణాశాఖ కొరడా ఝుళిపిస్తోంది. ఇటీవలకాలంలో వివిధ ప్రమాదాల్లో బస్సులు దగ్ధంకావడం, జరుగుతున్న వరుస ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని ఆర్టీఏ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన బస్సులను సీజ్‌చేసి అపరాధ రుసుము విధిస్తున్నారు. దీనిలో భాగంగా కోనసీమ జిల్లా ముఖ ద్వారమైన ఈతకోట టోల్ ప్లాజా వద్ద వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులపై ఆర్టీవో అధికారులు విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించారు. ప్రతీ ట్రావెల్ బస్సు మోటారు వాహనాల చట్ట నిబంధనల ప్రకారం భద్రతా ప్రమాణాలు విధిగా పాటించాలని, లేకుంటే బస్సులను సీజ్‌చేసి ఫిట్‌నెస్ రద్దు చేస్తామని జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాస్ హెచ్చరించారు. దీనిలో భాగంగా ఈతకోట టోల్‌ప్లాజా వద్ద ట్యాక్సు చెల్లించకుండా నడుపుతున్న హైదరాబాద్ గనిశ్రీ ట్రావెల్స్‌కు చెందిన ఒక బస్సును సీజ్ చేసినట్టు శ్రీనివాస్ తెలిపారు. నిబంధనలు పాటించకపోవడంతోపాటు ట్యాక్సు చెల్లించని గనిశ్రీ ట్రావెల్ బస్సుకు రూ.3.70 లక్షలు జరిమానా విధించారు. అలాగే జిల్లావ్యాప్తంగా అన్నంపల్లి సహా వివిధ ప్రాంతాల్లో 13 ట్రావెల్ బస్సులను తనిఖీచేసి రూ.3.93 లక్షలు అపరాధ రుసుం విధించినట్టు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో మోటారు వెహికల్ ఇనస్పెక్టర్లు రాజేంద్రప్రసాద్, ఓలేటి శ్రీనివాస్, షణ్ముక శ్రీనివాస్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రైవేటు ట్రావెల్ బస్సులు నడిపితే కఠినచర్యలు తీసుకుంటామని డీటీవో హెచ్చరించారు.

బాలబాలాజీ దేవస్థానం ధర్మకర్తగా లక్ష్మీనారాయణ



లక్ష్మీనారాయణతో ప్రమాణస్వీకారం చేయిస్తున్న సహాయ కమిషనర్ సత్యనారాయణరాజు

మామిడికుదురు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం వంశపారంపర్య ధర్మకర్తగా మొల్లేటి లక్ష్మీనారాయణ (చక్రి)ని నియమించినట్టు ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆలయ నిర్మాత మొల్లేటి రామస్వామి తనయుడైన లక్ష్మీనారాయణను వంశపారంపర్య ధర్మకర్తగా నియమించడంపై గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. దీంతో ఆయన ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆశీర్వచనం ఇచ్చారు. సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు ఆయనతో ధర్మకర్తగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా చక్రి మాట్లాడుతూ ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సహకారంతో దేవస్థానాన్ని అభివృద్ధి పరచడానికి కృషిచేస్తానన్నారు. ఆలయ సిబ్బందితోపాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

కార్తీకం.. రూ.కోటి ఆదాయం!

● సత్యదేవుడి సన్నిధికి ఆదివారం లక్ష మంది భక్తుల రాక

● 10,523 వ్రతాలు ● గంటల తరబడి క్యూలైన్లలో ఉండిపోయిన జనం

7

హోరెత్తిన కుల వన సమారాధనలు

కోనసీమ అంతటా ఇదే సందడి

శెట్టిబలిజ వనసమారాధనకు పోటెత్తిన జనం

భారీగా కాపు, క్షత్రియ, బీసీ కులాల వన భోజనాలు

రాజకీయాలకు అతీతంగా ప్రముఖ నేతలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

రాజకీయాలకు అతీతంగా నిర్వహిస్తున్న కుల వనసమారాధనలతో కోనసీమ జిల్లా ఆదివారం హోరెత్తిపోయింది. వివిధ రాజకీయ పార్టీల్లో ఉండే నేతలు తరచూ దుమ్మెత్తి పోసుకునేవారంతా కులవేదికలపై మాత్రం సంఘీభావం ప్రకటిస్తారు. ఈసారి కార్తీకమాసంలో కూడా కులవనసమారాధన కార్యక్రమాలు పెద్దఎత్తున జరుగుతున్నాయి. ఈ ఆదివారం ఎక్కడికక్కడ తిరునాళ్ల మాదిరిగా ఈ కుల సంఘాల వన సమారాధనలు జరిగాయి. గతంలో మిత్రులు, విద్యార్థులు, కాలనీలు, అపార్ట్‌మెంట్లవారు, వివిధ సంఘాల వారు పిక్నిక్‌ల పేరిట కార్తీకమాస వన సమారాధనలు నిర్వహించేవారు. వాటి సంఖ్య కొంత తగ్గుతూ ఉండగా, కుల సంఘాల వనభోజనాలే ప్రధాన పాత్ర వహిస్తుండడం గమనార్హం. కొందరు తమ కులంలోనే ఇంటిపేరుతో కూడా వన విందు భోజనాలు ఏర్పాటు చేసుకోవడం కోనసీమలో ప్రత్యేకంగా కనిపిస్తోంది. గత కొన్ని రోజుల నుంచి జిల్లావ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కుల వనసమారాధనలు హోరెత్తిపోతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం అమలాపురం కేంద్రంగా వివిధ సామాజిక వర్గ సంఘీయుల వనసమారాధనలతో పట్టణమంతా కిక్కిరిసిపోయింది. ప్రధానంగా ఎత్తురోడ్డు వద్ద గల సత్తెమ్మచెట్టు వద్ద వేలాదిమందితో కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో శెట్టిబలిజ వనసమారాధన జరిగింది. అలాగే అమలాపురంలో క్షత్రియ సేవాసమితి, కాపు ఉద్యోగ సేవాసమితి, విశ్వబ్రాహ్మణ సంఘాలతోపాటు రజక సంఘీయులు సమారాధనలు ఏర్పాటు చేసుకున్నారు. అదేవిధంగా పి.గన్నవరం మండలం ఎల్.గన్నవరం డొక్కావారితోటలో కాపు వనసమారాధన, శ్రీకృష్ణదేవరాయ యాదవసంఘం వనసమారాధనలు జరిగాయి. మాచవరంలో కోనసీమ కుమ్మరిశాలివాహన సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన జరిగింది. శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కాపు వనసమారాధన జరిగింది. అమలాపురంలో కాపు కల్యాణ మండపంలో కాపుల వనసమారాధన హోరెత్తింది. ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో యాదవుల వనసమారాధన జరిగింది. గత కొన్ని రోజుల క్రితం శివకోడులో కాపు, తాటిపాకలో శెట్టిబలిజల, అమలాపురంలో గౌడ, స్థానిక శెట్టిబలిజ సంఘ నాయకుల ఆధ్వర్యంలో వనసమారాధనలు జరిగాయి. కపిలేశ్వరపురంలో కాపు వనసమారాధనలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఇరిగేషన్ అభివృద్ధి చైర్మన్ లీలాకృష్ణలు పాల్గొన్నారు. కొత్తపేటలో ఆదివారం బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో కాపువనసమారాధన జరిగింది. ఇలా జిల్లా నలుమూలల్లో కుల సంఘాల ఆధ్వర్యంలో జరిగిన వనసమారాధనలకు రాజకీయ పార్టీలకు అతీతంగా నాయకులతో సహా ఆయా సామాజికవర్గాలకు చెందిన పేదవర్గం నుంచి ఉన్నత వర్గం వరకు ఉన్న ప్రముఖులంతా హాజరై సంఘీయులకు ఐక్యతా బలాన్ని ఇచ్చారు. కులాలకు కేంద్ర బిందువుగా ఉండే కోనసీమలో కుల సంఘాల ఆధ్వర్యంలో సమారాధనలు హోరెత్తిపోతున్నాయి. ఉభయ రాష్ట్రాల నుంచి భారీగా ఆయా సంఘీయులు హాజరవుతున్నారు. ఆయా సామాజికవర్గాల్లో ఆర్థికంగా వెనుకబడిన పేదవర్గాల పిల్లలకు విద్యాబోధనలకు అవసరమైన ఆర్థికసాయంతోపాటు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి చేయూతనిచ్చే కార్యక్రమాలకు ఈ వనసమారాధనలు వేదికగా మారాయి. ఆయా సామాజికవర్గాల్లో కొందరు ప్రముఖులుగా ఎదిగి రాజకీయ పార్టీల్లో ఉన్నతమైన పదవులు పొందడానికి వనసమారాధనలు వేదికగా చేసుకుంటున్నారనడానికి ఎన్నో ఉదాహరణలు చెబుతున్నారు.



అమలాపురంలో జరిగిన శెట్టిబలిజ వనసమారాధనకు పోటెత్తిన సంఘీయులు

చెముడులంక హైవే సర్వీసు రోడ్డు పనులు ప్రారంభం

» మడికి వద్ద ఆక్రమణల తొలగింపు » డ్రైన్ పనులు ప్రారంభం




ఆలమూరు మండలం మడికి వద్ద హైవే సర్వీసు రోడ్డు కోసం డ్రైన్ పనులు చేపట్టిన దృశ్యం

ఆలమూరు, నవంబరు16(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో సర్వీసు రోడ్లను నిర్మాణంలో భాగంగా ఆలమూరు మండలం చెముడలంక వద్ద దాదాపు మూడు కిలోమీటర్ల మేర సర్వీసు రోడ్డుకు ప్రతిపాదించారు. దీనిలో భాగంగా ఆదివారం నుంచి సర్వీసు రోడ్ల పనులు వేగవంతం చేశారు. మడికి అంతర్‌రాష్ట్ర కూరగాయల మార్కెట్ నుంచి చొప్పెల్ల వరకు సర్వీసు రోడ్డు నిర్మాణానికి హైవే అధికారులు ప్రణాళిక సిద్ధంచేశారు. సర్వీసు రోడ్డుకు ముందస్తుగా 1999లోనే నాలుగు లేన్ల విస్తరణలో భాగంగా సర్వీసు రోడ్డుకు భూసేకరణ చేసేశారు. అయితే అప్పటి నుంచి సర్వీసు రోడ్డు నిర్మించలేదు. ఇటీవలకాలంలో మడికి కూరగాయల మార్కెట్ వద్ద ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోవడం జరిగింది. దీంతో ఈ ప్రాంతంలో సర్వీసు రోడ్డు మంజూరుచేశారు. మడికి నుంచి చొప్పెల్ల వరకు మధ్యలో ఉన్న మడికి, గాంధీనగరం, చెముడులంక గ్రామాల వద్ద షాపులు, ఇళ్ల నిర్మాణాలు ఉండడంతో వాటిని తొలగించే పనులు మొదలుపెట్టారు. అయితే తొలగిస్తున్న షాపులు, ఇళ్ల యాజమాన్యులు తమకు నష్టపరిహారం చెల్లించాలని పట్టుపడుతున్నారు. అయితే గతంలోనే ఇక్కడ భూసేకరణ జరిగిందని, అందువల్ల ఆ భూమి తమదేనని హైవే అధికారులు వాదిస్తున్నారు. సర్వీసు రోడ్డు నిర్మాణంలో కొన్ని ప్రాంతాల్లో అంతగా ఇబ్బందులు ఉండవని, ముఖ్యంగా చెముడులంక, గాంధీనగరం ప్రాంతాల్లో నష్టం జరుగుతుందని అంచనా వేస్తున్నారు. సర్వీసు రోడ్డు నిర్మాణంలో భాగంగా తొలుత చేపట్టిన డ్రైన్ నిర్మాణంతో విద్యుత్ లైన్లు మార్చాల్సి ఉంది. దీనికి సంబంధించి విద్యుత్‌శాఖకు రూ.3 కోట్ల వ్యయం అవుతుందని అంచనాలు వేయడంతో ఆ మేరకు చెల్లింపులు కూడా జరిగాయి. రోడ్డు డ్రైన్లు నిర్మాణ సమయంలోనే విద్యుత్ లైన్లు మార్పుకు ఆ శాఖ సన్నాహాలు చేస్తోంది.

బాధితుల అత్యవసర సమావేశం..

హైవేపై సర్వీసు రోడ్డు నిర్మాణంలో భాగంగా నష్టపోతున్న బాధితులు ఆదివారం చెముడులంక శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. సర్వీసు రోడ్డు నిర్మాణం వల్ల తాము భారీగా నష్టపోతున్నామని, తమకు నష్టపరిహారం చెల్లించాలని, లేదంటే ఎటువంటి ఆందోళనకైనా సిద్ధమని వారు బాధితులు హెచ్చరించారు.





సూర్యాస్తమయం..

అది సూర్యాస్తమయం.. మెల్లగా సూరీడు కిందకు దిగుతున్నాడు.. గోదావరిపై కిరణాలు ప్రసరిస్తూ కనువిందు చేశాడు. యానాం రాజీవ్‌గాంధీ బీచ్‌లో గౌతమీ గోదావరి వద్ద ఆదివారం కనిపించిన అందమైన దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిందిలా...
- యానాం (ఆంధ్రజ్యోతి)

కార్తీకం.. రూ.కోటి ఆదాయం!

- సత్యదేవుడి సన్నిధికి ఆదివారం లక్షమంది భక్తుల రాక
- 10,523 వ్రతాలు
- వివిధ విభాగాల ఆలయానికి సమకూరిన రూ.కోటి ఆదాయం



సత్యదేవుడి ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరిదశకు చేరుతుండడంతో అన్నవరం సత్యదేవుడి సన్నిధి ఆదివారం అశేష భక్తజనంతో పోటెత్తింది. సత్యదేవుడి వ్రతాల సంఖ్య 10వేలుదాటింది.10,523 వ్రతాలు జరగగా సుమారు లక్షమంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా రూ.కోటి ఆదాయం లభించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని 2గంటల నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చైర్మన్ రోహిత్ లిఫ్ట్ ప్రాంగణం, ఈవో సుబ్బారావు వ్రత మండపాలు, క్యూలైన్‌లను పర్యవేక్షించారు. రద్దీ అధికంగా ఉండడంతో ఆలయం లోపల ఖాళీ ఆధారంగా హోల్డింగ్ పాయింట్ల నుంచి రథపాత్‌కు వదిలారు. తూర్పురాజగోపురం ఎదురుగా రావిచెట్టు దిగువున ఉన్న గేట్ల ను మూసివేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి 3గంటలు, వ్రతంకోసం వచ్చిన భక్తులు వ్రతం, దర్శనం పూర్తవడానికి సుమారు 5గంటలు వేచిఉన్నారు. నిత్యాన్నదాన ట్రస్ట్ ద్వారా 40వేల మందికి ఉచిత పులిహోర ప్రసాదం వితరణ గావించారు.



స్వామివారి దర్శనానికి క్యూలో వేచిఉన్న భక్తులు

ఘనంగా రథోత్సవం



రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. భక్తుల రద్దీ నేపథ్యంలో ఉదయం జరగాల్సిన రథోత్సవం సాయంత్రం నిర్వహించారు. ప్రధానాలయం నుంచి స్వామి,అమ్మవార్లను తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చి ప్రత్యేక పూజలు చేసి అనంతరం పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి చింతలపూడికి చెందిన చిట్టూరి జయబాబు రూ.1,01,116 విరాళం ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో పీఆర్వో అనకాపల్లి ప్రసాద్ తదితరులున్నారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

ఆరోగ్య ప్రదాత ధన్వంతరి

- చింతలూరులో కొలువైన స్వామివారు
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఆలయం
- నేడు జయంతి సందర్భంగా వ్రతం, పూజలు



చింతలూరులో కొలువైన ధన్వంతరిస్వామి



చింతలూరులోని ధన్వంతరి ఆలయం

ఆలమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాతగా, దర్శనభాగ్యంతో సర్వరోగ నివారణ కలిగించే శక్తి గల స్వామిగా శ్రీధన్వంతరి స్వామిని కొలుస్తారు. శ్రీమన్నారాయణుని యేకవింశతి అవతారాల్లో పన్నెండవది ధన్వంతరి అవతారం. ఇంతటి శక్తిగల ధన్వంతరి స్వామివారికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఆలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో ఉంది. దేవదానవులు అమృత సంపాదనకై క్షీర సాగరాన్ని మథించే తరుణంలో శంఖు, చక్ర, ఔషధ, సుధా కలశాలు నాలుగు హస్తముల ధరించి పాలకడలి నుంచి బయల్పడిన విష్ణుంశసంభూతుడు ధన్వంతరి. దుర్వాసుని శాపంతో రోగభూయిష్టమైన స్వర్గలోకంలో ఆయుర్వేద ప్రచారకుడై, ఆరోగ్య ప్రదాతయై ఆరాధ్యదైవమైనాడు ఈ స్వామి. ధన్వంతరిని ఆయుర్వేద రంగానికి ఆరాధ్యదైవంగా కొలుస్తారు. ఆయన కరుణాకటాక్షాలతోనే ఆయుర్వేద రంగం కొనసాగుతోందని పలువురు ఆయుర్వేద పండితుల విశ్వాసం. ధన్వంతరి స్వామి కటాక్షంతో ఆయుర్వేద పండితుడు, వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం వ్యవస్థాపకులైన వైద్యరాజ ద్విభాష్యం వేంకటేశ్వర్లు భక్తి ప్రపత్తులతో ధన్వంతరిస్వామి ఆలయాన్ని ఆలమూరు మండలం చింతలూరులో 1942లో ప్రతిష్ఠించి నిత్య ధూప, దీప, నైవేద్యాదులకు శ్వాశత భూ వసతి కల్పించారు. వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం ప్రస్తుతం మేనేజింగ్ డైరెక్టర్ ద్విభాష్యం వెంకటశ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ధన్వంతరి ఆలయాన్ని పునరుద్ధరణ చేసి అభివృద్ధి చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఆలయంగా ఉండడంతో ధన్వంతరీ స్వామిని దర్శించుకోవడానికి అనేక ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. శ్రీధన్వంతరి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి చింతలూరు రానున్నారు. ధన్వంతరి వ్రతం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి.

'లోవ'లో భక్తుల కోలాహలం

రూ.2.46 లక్షల ఆదాయం





దర్శనమిస్తున్న తలుపులమ్మ, క్యూలో బారులుతీరిన భక్తులు

తుని రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం భక్తుల కోలాహలంగా మారింది. ప్రత్యేక క్యూలలో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.2.46 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



మరణించిన ఏసురత్నం

అమలాపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నుంచి అంబాజీపేట వైపు వెళ్తున్న మోటారు సైకిలిస్టు పరమట ఏసురత్నం (65) కంటైనర్ లారీ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన ఏసురత్నం ఆదివారం సాయంత్రం పని కోసం మోటారుసైకిల్‌పై అమలాపురం వచ్చాడు. పని ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. ప్రధాన ఏజీ రోడ్డుపై బండారులంక అంబేడ్కర్‌నగర్‌కు వచ్చేసరికి కాకినాడ నుంచి భీమవరం వెళ్తున్న అశోక్ లేలాండ్ కంటైనర్ లారీ మోటారుసైకిల్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఏసురత్నం తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్‌బాబు పేర్కొన్నారు..

మల్లేపల్లిలో తాచుపాము హతం

గండేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామం అనపరాజుపేటలో ఆదివారం రాత్రి గోధుమ తాచుపాము హల్‌చల్ చేసింది. కాలనీకి చెందిన ఆలేటి అప్పారావు ఇంటి లోపలకి పాము ప్రవేశించి చీకట్లో పడగ విప్పి ఉండడంతో స్థానికులు ఒక్కసారిగా చూసి భయాందోళనకు గురయ్యారు. తర్వాత పాము పెంకులోకి దూరడంతో గ్రామస్తులు అక్కడికి చేరుకుని పెంకులు తీసి పామును హతమార్చారు.



గ్రామస్తులు హతమార్చిన తాచుపాము

అక్రిడిటేషన్ కేవలం సర్టిఫికేషన్ కాదు

ఎన్ఈటీఎఫ్, న్యాక్, ఎన్‌బీఏ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుద్దే



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

జేఎన్టీయూకే, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌ను అమలుచేయడం విద్యానాణ్యతను ప్రపంచస్థాయికి తీసుకువెళ్లే మొదటి అడుగని, అక్రిడిటేషన్ అనేది కేవలం సర్టిఫికేషన్ ప్రక్రియ కాదని ఎన్ఈటీఎఫ్, న్యాక్, ఎన్‌బీఏ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుద్దే అన్నారు. జేఎన్టీయూకే అలూమ్నీ ఆడిటోరియంలో న్యూఢిల్లీలోని ఎన్‌బీఏ, జేఎన్టీయూకే, ఏపీఎస్సీహెచ్‌ఈ సంయుక్తంగా అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, అక్రిడిటేషన్‌పై అవగాహన కల్పించేందుకు ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించినట్టు పీఆర్వో, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. గౌరవ అతిథులుగా సహస్రబుద్దే, ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, ఎన్‌బీఏ కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్ నస్సా.. అతిథులుగా ఒరిస్సా రాష్ట్ర ఓపెన్ యూనివర్శిటీ వీసీ పట్నాయక్, ఎంఎస్ రామయ్య యూనివర్శిటీ డీన్ రంగనాథ్, డైరెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు. సహస్రబుద్దే మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులకు శిక్షణనివ్వడం, నేర్చుకున్న దాని ప్రాముఖ్యతను చూపించడం భవిష్యత్‌లో భారత విద్యా వ్యవస్థ లక్ష్యం కావాలన్నారు. ఆర్.మధు, కె.కృష్ణభాస్కర్, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, డైరెక్టర్లు ఉన్నారు.

కాకినాడలో టైక్వాండో చాంపియన్‌షిప్



క్రీడాకారులతో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

కాకినాడ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 39వ సబ్ జూనియర్, 8వ కాండేట్, 41వ సీనియర్ చాంపియన్‌షిప్ పోటీలు కాకినాడ సూర్యకళామందిరంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 250మంది క్రీడాకారులు హాజరయ్యారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించి రాష్ట్ర కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని ఆకాంక్షించారు. విద్య, ఉద్యోగాల్లో క్రీడా రిజర్వేషన్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్కే అబ్దుల్‌సలామ్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలతో రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు రాయుడు శ్రీను, రాష్ట్ర కోశాధికారి ఎం.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భార్య మరణించిన నాలుగు రోజులకే...

విద్యుత్‌షాక్‌తో భర్త మృతి
అల్లూరి జిల్లా గుండాల గ్రామంలో ఘటన



మృతిచెందిన వెంకటేశ్వర్లు

ఎటపాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మహిళ చనిపోయిన బాధ నుంచి కుటుంబం తెరుకోకముందే ఆ ఇంట్లో మరో విషాదం జరిగింది. కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే అనుకోని ప్రమాదంతో ఇంటి పెద్ద దిక్కును కోల్పోవల్సి వచ్చింది. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాసిబోయిన సుబ్బలక్ష్మి నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె పెద్ద కర్మ (కార్యం) ఈనెల 24న కుటుంబసభ్యులు చేయనున్నారు. కార్యక్రమం కోసం ఆదివారం మృతురాలి భర్త బాసిబోయిన వెంకటేశ్వర్లు (56), అతడి కొడుకు ఇంటి ఆవరణలో ఉన్న స్థలాన్ని శుభ్రం చేస్తున్నారు. ఇంటి ఆవరణలో 33 కేవీ విద్యుత్ లైన్ ఉండగా దాని కింద భా గాన ఫైబర్‌నెట్ (కేబుల్స్) ఉన్నాయి. ఇంటికి చెందిన విద్యుత్ సర్వీసు వైరు కింద కు వేలాడుతూ ఉండగా దానిని ఫైబర్‌వైరుతో కలిపి కట్టేందుకు ఇం ట్లో ఉన్న పాత విద్యుత్ వైర్లు తెచ్చి పైకి లాగి కట్టే క్రమంలో వెంకటే శ్వర్లుకు ఫైబర్ వైర్ల పైన ఉన్న 33కేవీ విద్యుత్ వైర్లకు విసిరిన పాత సర్వీస్ వైరుకు ప్రమాదవశాత్తు తగిలి షాక్ కొట్టిం ది. కాలిన గాయాలైన వెంకటేశ్వర్లును కుటుంబసభ్యులు వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. 4రోజుల వ్యవధిలో దంపతులు మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమనరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత కల్గిన తూర్పుగోదావరి జిల్లా వాసులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు రాజమహేంద్రవరంలోని బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు బి.శశాంక తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ ఉచిత శిక్షణకు బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రమే అర్హులని... దరఖాస్తులను నవంబరు 25వ తేదీలోగా రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పక్కన ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారని, అందులో ఉత్తీర్ణులైనవారికి మెరిట్ ఆధారంగా, రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేసి విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు నేరుగా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో కానీ.. సెల్ నెంబర్లు 9494452267, 9000058102లో సంప్రదించాలని శశాంక తెలియజేశారు.

'వెలుగు'లోకి వస్తున్న అక్రమాలు!

స్త్రీనిధి రుణాలు అవకతవకలపై విచారణ
ఆంధ్రజ్యోతి వార్తతో కదిలిన విజిలెన్సు అధికారులు



డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

పిఠాపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెలుగు సంస్థలో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. స్త్రీనిధి రుణాల స్వాహాపర్వంపై విచారణకు అధికార యంత్రాంగం కదిలింది. ఈనెల 14న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వెలుగు చూసేనా కథనానికి స్పందించి విజిలెన్సు బృందం తనిఖీలు చేస్తుంది. ఇందులో భాగంగా ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం వెల్దుర్తి, బి.కొత్తూరు గ్రామాల్లో స్త్రీ నిధి రుణాలపై విచారణ చేపట్టారు. గ్రామంలో రుణాలు తీసుకుని గత రెండేళ్లుగా చెల్లించని మొండి బకాయిలపై ఆరా తీశారు. పాత వీఏవో పద్మ చేసిన అవకతవకలు ఒక్కొటిగా బయటపడడంతో విచారణ మరింత ముందుకెళ్లింది. బి.కొత్తూరులో సుమారు రూ.19లక్షలు మొండి బకాయిలున్నాయని, వెల్దుర్తిలో రూ.8లక్షలు ఉన్నట్లు గుర్తించారు. వీటి వసూళ్లకై విజిలెన్సు రికవరీ బృందం వెళ్లగా అనేక అక్రమాలు బయటపడుతున్నాయి. సభ్యులు ఒకరైతే రుణం పొందింది మరొకరని, రుణాలు తీసుకుని చెల్లించినప్పటికీ బకాయిలు ఇంకా చూపిస్తున్నాయనే విషయాలు అధికారులు విచారణలో బయటకొచ్చాయి. కార్యక్రమంలో స్త్రీనిధి డీజీఎం శ్యామల, సెర్ప్ స్త్రీనిధి మేనేజర్లు భవానీ, కస్తూరి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లో పరిచయం.. హోటల్‌లో అత్యాచారం!

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

సీతానగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన గడుసుల నాగ వెంకటేష్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బాలిక ఇంటర్ చదివి విశాఖపట్నంలో ఎయిర్ హోస్టెస్‌గా శిక్షణ తీసుకుంటుంది. వాట్సాప్ ద్వారా నాగ వెంకటేష్‌తో పరిచయం ఏర్పడింది. ఆమెను పలు మార్లు విశాఖపట్నం తీసుకెళ్లడం చేసేవాడు. పరిచయం పెరగడంతో హైదరాబాద్‌లో ఇంటర్వ్యూ ఉందని చెప్పాలని వెంకటేష్ ఒత్తిడి మేరకు బాలిక తల్లిదండ్రులతో హైదరాబాద్‌లో ఇంటర్వ్యూ ఉందని చెప్పించి అక్కడకు తీసుకెళ్లాడు. హైదరాబాద్ ఎల్బీనగర్‌లో గత నెల 31 నుంచి వారిద్దరు హోటల్‌లో ఉన్నారు. శారీరకంగా కలవడానికి ఒత్తిడి చేయడంతో బాలిక తిరస్కరించింది. సామాజిక మాధ్యమాల్లో ఫోటోలు అప్‌లోడ్ చేస్తానని బాలికను వెంకటేష్ బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. తిరిగి ఈనెల 3న ఇంటికి చేరగా తల్లిదండ్రులకు బాలిక విషయం చెప్పడంతో వెంకటేష్ ఇంటి వద్దకు వెళ్లారు. వెంకటేష్ తల్లి కులంపేరుతో దూషిస్తూ దుర్భాషలాడింది. దీంతో ఆదివారం బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేష్‌తో పాటు అతడి తల్లిపైన కేసు నమోదు చేశామని.. నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ దర్యాప్తు చేస్తారని ఎస్ఐ పేర్కొన్నారు.

కంప్యూటేషనల్ థింకింగ్ ప్రాథమిక నైపుణ్యం

జేఎన్టీయూకే, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రపంచంలో కంప్యూటేషనల్ థింకింగ్ ఒక ప్రాథమిక నైపుణ్యమని విద్యార్థుల్లో సమస్యలను పరిష్కరించే శక్తిని పెంచుతుందని డీవీఎస్ఎం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ డి.హరిప్రసాద్ తెలిపారు. జేఎన్టీయూకే వర్సిటీలోని యూసీఈకే సెమినార్ హాల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, యూసీఈకే, డీవీఎస్ఎం ట్రస్ట్ సంయుక్తంగా ఆదివారం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరిప్రసాద్ మాట్లాడుతూ నేర్చుకున్న అంశాలను పాఠశాలల విద్యార్థులతో పంచుకుంటే వారు చిన్న వయస్సులోనే నూతన ఆలోచనలతో ముందుకుసాగగలరన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకుల ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హరిప్రసాద్

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

● ఆధ్యాత్మిక కార్తీక వనసమారాధనలు ● సంఘీయుల ఐక్యతే లక్ష్యంగా ప్రసంగాలు



కొంకాపల్లిలో క్షత్రియ వనసమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, అమలాపురంలో విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో...



యానాంలో కాపు వన సమారాధనలో పాల్గొన్న నాయకులు



అంబాజీపేటలో కుమ్మరి శాలివాహన సంఘ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

అమలాపురంరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వయోబేధం మరచి ఆట పాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. హోదాలను పక్కనపెట్టారు. కార్తీకమాసం చివరి ఆదివారం రోజున కులాల వారీగా, సంఘాల వారీగా కార్తీక వనసమారాధనలు నిర్వహించారు. అందరూ ఒక్కటేనన్న భావనతో ఆధ్యాత్మిక కార్తీక వనసమారాధనలు జరిగాయి. సంఘ ప్రముఖుల ఆధ్వర్యంలో ఆమ్లకవృక్షంవద్ద పూజలు చేశారు.

క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో..

ఐకమత్యంతో జీవిస్తూ ప్రతీఒక్కరూ సంఘీయుల అభివృద్ధికి పాటుపడాలని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పిలుపునిచ్చారు. కొంకాపల్లి క్షత్రియ కల్యాణ మండపంవద్ద ఆదివారం శ్రీకోనసీమ క్షత్రియ సేవాసమితి ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అధిక సంఖ్యలో సంఘీయులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. తొలుత మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభకు దాట్ల సత్యనారాయణరాజు అధ్యక్షత వహించి మాట్లాడుతూ 1987లో క్షత్రియ పరిషత్‌ను ఏర్పాటు చేశామన్నారు. సంఘ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు పేర్కొన్నారు. పెన్మెత్స జగ్గప్పరాజు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో ఎమ్మెల్సీ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), కోనసీమ క్షత్రియ సేవా సమితి అధ్యక్షుడు బీఎస్ఎన్ రాజు, కార్యదర్శి పి.వెంకటపతిరాజు, నాయకులు సయ్యపరాజు సత్తిబాబురాజు, కొత్తూరి వెంకటపతిరాజు, వేటుకూరి ప్రసాదరాజు, పెన్మెత్స చిట్టిరాజు, దాట్ల బాబు, పాకలపాటి చంటిరాజు, జంపన సత్తిబాబురాజు తదితరులు పాల్గొన్నారు. ప్రతీ ఏటా క్షత్రియ కార్తీక వనసమారాధనకు తనవంతుగా ఏటా రూ.1.25లక్షలు చొప్పున గత పదేళ్లుగా విరాళం అందజేస్తున్న క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజును సేవా సమితి ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

కాపు ఉద్యోగ సేవాసమితి ఆధ్వర్యంలో..

కాపు ఉద్యోగ సేవాసమితి ఆధ్వర్యంలో ఈదరపల్లి శివాలయం రోడ్డులో కార్తీక వనసమారాధన నిర్వహించారు. జిల్లాసంఘ గౌరవాధ్యక్షుడు అన్యం రాంబాబు, జిల్లాశాఖ అధ్యక్షుడు నల్లా రామకృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చిక్కాల గణేష్, మోకా వెంకటసుబ్బారావు, కొప్పుల నాగమానస, ఉద్యోగ సంఘ తాలూకా అధ్యక్షుడు చిక్కం మహేష్, ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

శ్రీవిశ్వబ్రాహ్మణ స్వర్ణకార సంక్షేమ సంఘ అధ్యక్షుడు మానేపల్లి సత్యప్రకాష్, ప్రధాన కార్యదర్శి కర్రి నారాయణరావు ఆధ్వర్యంలో అమలాపురం వాసర్ల గార్డెన్స్‌లో కార్తీక వనసమారాధన నిర్వహించారు. డీసీఎం ఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి ముఖ్యఅతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జిల్లాశాఖ అధ్యక్షుడు ర్యాలి రాజశేఖర్ లక్కీడిప్ విజేతలకు వెండి పట్టీలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో శ్రీశైలం పండు, అల్లక వాసు, తాళాబత్తుల చినబాబు, అనుపోజు శ్రీనివాస్, కట్టోజు సన్నాయిదాసు, మాగంటి ఫణిప్రకాష్, పుల్లేటికుర్రి భాస్కరరావు, దాకోజు భీమశంకరం, వరదా చినసత్తిబాబు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

రజక సంఘీయుల ఆధ్వర్యంలో అమలాపురంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే విధంగా పార్లమెంటులో తక్షణం చట్టంచేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని సంఘ పెద్దలు పిలుపునిచ్చారు. సంఘ ప్రముఖులు పేట వెంకటేశ్వరరావు, మాచవరపు కామేశ్వరరావు, చెయ్యేటి కిరణ్‌కుమార్, పేట మనికంఠ, పేట హనుమంతు, యు.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ముమ్మిడివరం(ఆంధ్రజ్యోతి): యాదవులకు ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. శ్రీకృష్ణ యాదవసంఘం ఆధ్వర్యంలో ముమ్మిడివరంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణమండపంలో ఆదివారం జరిగిన యాదవ ఐక్య వనసమారాధన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యాదవ సంఘ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. శ్రీకృష్ణ యాదవ సంఘ అధ్యక్షుడు కోరశిక రాము మాట్లాడుతూ యాదవులంతా ఐక్యంగా ఉండి హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యక్షుడు పాశం సత్తిబాబు, మండపాటి బాలుయాదవ్, మండపాటి భైరవస్వామి, కె.సంజయ్, మట్ట రాంబాబు, ఎం.శ్రీనివాసరావు, సత్తిబాబు పాల్గొన్నారు.

పి.గన్నవనరం(ఆంధ్రజ్యోతి): వైవీపాలెంలో యర్రంశెట్టి వారి ఆధ్వర్యలో ఉసిరిచెట్టు వద్ద ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం కార్తీక వనసమా రాధనలో భాగంగా అన్నసమారాధన జరిగింది. లంకల గన్నవరంలో పి.గన్నవరం మండల శ్రీకృష్ణ యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత ఉసిరి చెట్టు వద్ద పూజలుచేసి అనంతరం కార్తీక వనసమా రాధన, పలువురు సంఘ నాయకులకు సన్మానాలు నిర్వహించారు. పి.గన్నవరం కాపు సామాజిక వర్గం ఆధ్వర్యంలో వనసమారాధనలో ఉసిరి చెట్టువద్ద అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని పూజలు చేశారు. ఏపీ ప్రత్యేకదళం రాజమహేంద్రవరం కమాండెంట్ కొండ నరసింహరావు, ఆలివేలు మంగాదేవి దంపతులు శంఖం పూరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

'వనసమారాధనలు ఐక్యతకు దోహదం'

అంబాజీపేట(ఆంధ్రజ్యోతి): కార్తీక వనసమారాధనలు ఐక్యతకుదోహద పడతాయని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. అంబాజీపేట మండలం మాచవరంలో కోనసీమ కుమ్మరిశాలివాహన సంఘ కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని సంఘ అధ్యక్షుడు మానేపల్లి వీరబ్రహ్మాణ్యం అధ్యక్షతన ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలివాహన రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు తుగలి నాగేంద్ర, ఎం.పురుషోత్తంలు మాట్లాడుతూ కుమ్మరి సంఘీయులంతా పటిష్టతకు ఐక్యమత్యంగా ఉండాలన్నారు. కవయిత్రి మొల్లమాంబ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, ఏపీ ఇండస్ట్రీయల్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, మాజీ ఎంపీ చింతా అనురాధ, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త గన్నవరపు శ్రీనివాస్, శిల్పి రాజకుమార్ వడయార్, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి వెంకటసుబ్బారావు, సంఘ నాయకులు దాలిపర్తి భీమేశ్వరరావు, ఆదుర్తి నారాయణమూర్తి, మంతెన శ్రీనివాస్, మానేపల్లి వీరబ్రహ్మాణ్యం, పుల్లేటికుర్తి రత్నం, దొడ్డిపట్ల శ్రీనివాస్, ర్యాలి శ్రీనివాస్‌వడయార్, చిరతపూడి హేమలత పాల్గొన్నారు.

తెలగా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో..

యానాం(ఆంధ్రజ్యోతి): యానాం తెలగా (కాపు, బలిజ)అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక బైపాస్‌లోని పెద్దిరెడ్డి వినాయకరావు యానాం కాపు కళ్యాణమండంలో సంఘ అధ్యక్షుడు కాటంశెట్టి వెంకటరామ్మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యాక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, పేరాబత్తుల రాజశేఖరం, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాసఅశోక్ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడారు. కాపు కులస్థులు ఒకే తాటిపై ఉంటూ కులాన్ని అన్నివిధాలా సహాయ కార్యక్రమాలు చేయాలన్నారు. కాపులలో అనేకమంది పేదవారు ఉన్నారని వారికి మనం చేయూత నందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆటలపోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నల్లా వెంకన్న, చిక్కాల నరసింహమూర్తి, కొన సుబ్బారావు, చెక్కల అరుణ్ కుమార్, గుండాబత్తుల ప్రసాద్, రత్నానాయుడు, కేదార్‌నాధ్ తదితరులు పాల్గొన్నారు.

కాకతీయ కమ్మసంఘం ఆధ్వర్యంలో...

యానాం శివారు అడవిపొలంలో కాకతీయ కమ్మసంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఉసిరిచెట్టువద్ద సంఘ సభ్యులు పూజలు నిర్వహించి సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న వారిని ఘనంగా సత్కరించారు.

ఐక్యత నింపేందుకే వన సమారాధన

● పోటెత్తిన శెట్టిబలిజ సంఘీయులు

● యాక్షన్‌ఫోర్సుకు రూ.కోటి విరాళం ప్రకటించిన మంత్రి సుభాష్



సభలో మాట్లాడుతున్న మంత్రి వాసంశెట్టి సుభాష్

అమలాపురం(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన అమలాపురంలోని కొంకాపల్లి సమీపంలో సత్తెమ్మతల్లి ఆలయ ఆవరణ ప్రాంగణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాల్గో శెట్టిబలిజ కార్తీక వనసమారాధన ఆత్మీయ సమ్మేళనానికి సంఘీయులు వేలాదిగా పోటెత్తారు. రాజకీయాలకు అతీతంగా అన్నిపార్టీలకు చెందిన ముఖ్యనాయకులతో సహా ఆ సామాజికవర్గంలోని ప్రముఖులంతా కార్యక్రమానికి హాజరై సంఘీభావం తెలిపారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, అతని తండ్రి వాసంశెట్టి సత్యంల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన శెట్టిబలిజ వనసమారాధనలో భారీగా జన సందోహం పాల్గొనడంతో ఆ ప్రాంగణమంతా కిక్కిరిసిపోయింది. వాసంశెట్టి సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్మికశాఖమంత్రి సుభాష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సుభాష్ అను నేను జీవించి ఉన్నంత వరకు శెట్టిబలిజ జాతిలో ఏ ఒక్కరికి కష్టం వచ్చినా అండగా ఉండి ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. సంఘీయులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారిలో ఐక్యత నింపే ఉద్దేశంతో ఈ కలయిక ఏర్పాటుచేసినట్టు తెలిపారు. జనాభాలో అధిక శాతంఉన్న బీసీలు ఐక్యంగా ఉంటూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయ చైతన్యం కలిగి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పార్టీలకు అతీతంగా తరలివచ్చిన సంఘీయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్తీక వనసమారాధన సభలో అనేక మంది ప్రముఖులు పాల్గొని తమ ప్రసంగాలు చేశారు. కులస్తులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పేదవర్గాల వారికి సంఘీయుల తరపున అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వైసీపీ ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, వివిధ హోదాల్లో ఉన్న శెట్టిబలిజ నాయకులు గుత్తుల సాయి, వాసంశెట్టి సత్యం, వాసంశెట్టి చినబాబు, చొల్లంగి వేణుగోపాల్, వాసంశెట్టి రాజేశ్వరరావు, పెంకే శ్రీనివాసబాబా, మట్టపర్తి నాగేంద్ర, చొల్లంగి వెంకటరమణ, పెచ్చెట్టి విజయలక్ష్మి, పిల్లి సత్యనారాయణ, కుడుపూడి సత్తిబాబు, చొల్లంగి వెంకటరమణతో సహా ఉభయ రాష్ట్రాలకు చెందిన కీలక శెట్టిబలిజ నేతలు కార్యక్రమంలో పాల్గొని సంఘీయులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ ఆత్మీయ కలయిక సందర్భంగా శెట్టిబలజి యాక్షన్ ఫోర్స్ (ఎస్ఏఎఫ్)ను స్థాపిస్తున్నట్టు కార్మికశాఖ మంత్రి సుభాష్ సంఘీయుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. తాను వ్యక్తిగతంగా రూ.కోటి నిధులను శెట్టిబలిజ యాక్షన్ ఫోర్సు కోసం విరాళంగా ప్రకటించి వారం రోజుల్లో ఎస్ఏఎఫ్ ఖాతాలో సొమ్ములు జమచేస్తామని మంత్రి సుభాష్ ప్రకటించారు.

వైభవంగా శాంతి కల్యాణం



స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): నవ నారసింహ క్షేత్రాల్లో ఒకటైన అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బహుళ ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మహాశాంతి కల్యాణం వైభవంగా జరిగింది. తొలుత అర్చకులు స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులుచేసి పూజా కార్యక్రమాలతో పాటు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహణం, మాంగల్యధారణ నిర్వహించారు. అనంతరం భక్తుల గోవింద నృసింహ నామస్మరణల మధ్య అర్చకులు కల్యాణ తంతు నిర్వహించారు. అధిక సంఖ్యలో అర్చకులు శాంతి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

కార్తీకమాస ఆదివారం కావడంతో అంతర్వేది పుణ్యక్షేత్రానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. పుణ్యక్షేత్ర పురవీధులు భక్తులతో కిటకిటలాడాయి. తొలుత క్షేత్ర సంరక్షకుడు ఆంజనేయస్వామి, క్షేత్ర పాలకుడు నీలకంఠేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల తాకిడితో నాలుగు గోపురాల వద్ద కిక్కిరిసింది. ఉదయం నుంచి సముద్ర, నదీ పరివాహక ప్రాంతాలైన అంతర్వేది బీచ్, లైట్‌హౌస్, సాగర సంగమం వద్ద భక్తులు సందడి చేశారు. సరుగుడు, కొబ్బరి తోటల్లో కార్తీక వనసమారాధన భోజనాలు నిర్వహించుకున్నారు.

రేపు లక్ష రుద్రాక్ష పూజ



రామలింగేశ్వరస్వామి

అమలాపురంటౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): అమలాపురం శివాలయం రోడ్డులో ఉన్న శ్రీసర్వమంగళ రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 18న మాసశివరాత్రిని పురస్కరించుకుని 25వ లక్ష రుద్రాక్ష పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఆలయ చైర్మన్ మాచిరాజు రవికుమార్-నాగవల్లీ దంపతులు తెలిపారు. సర్వమంగళ రామలింగేశ్వరస్వామికి పంచముఖ లక్ష రుద్రాక్ష పూజ, సర్వమంగళాదేవి అమ్మవారికి శతసహస్ర కుంకుమపూజ, ఉపాలయాల్లో ఉన్న శ్రీమోక్షగణపతికి శతసహస్ర గరికపూజ, శ్రీషిర్డిసాయిబాబాకు శతసహస్ర బిల్వార్చన, శ్రీప్రసన్నాంజనేయస్వామికి శతసహస్ర సిందూర నాగవల్లీదళ పూజను అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని ఆధ్వర్యంలో 22 మంది రుత్వికులచే శాస్త్రోక్తంగా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు హాజరవుతారన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కాళ్లకూరి నాగ వెంకటభూషణం, పాండురంగారావు, వెత్సా సత్యనారాయణ, నరసింహారావు పాల్గొన్నారు.

సహకార సంఘాలను బలోపేతం చేద్దాం

● ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



సహకార పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల బలోపేతానికి ప్రతీఒక్కరు పాటుపడాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. వియ్యారువారిమెరక సహకార సంఘంవద్ద సంఘ అధ్యక్షుడు వీరా వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన సహకార వారోత్సవాల సభలో ఆయన మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం రైతుల సంక్షేమంకోసం పాటుపడుతుందన్నారు. రాజోలు నియోజకవర్గ పరిధిలోని 26 సహకార సంఘాల నాయకులు, రైతుల సంక్షేమం కోసం ముందుకు వెళ్లాలన్నారు. మొన్న జరిగిన డీఆర్సీ సమావేశంలో మన నియోజకవర్గానికి ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని వ్యవసాయశాఖ మంత్రిని కోరానని ఆయన అన్నారు. ప్రతీ రైతుకు రూ.10వేలు ప్రకటించాలని, ప్రతీ కొబ్బరిచెట్టు రూ.1500 ప్రకటిస్తే రైతులకు కొంత వెసులుబాటు కలుగుతుందని తాను కోరానని చెప్పారు. 72వ సహకార వారోత్సవాల సందర్భంగా ముందుగా సహకార పతాకాన్ని ఎగురవేశారు. రైతులకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న దాణాను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వీరా వెంకటరామారావు, సర్పంచ్ ఓగూరి రత్నకుమారి, బర్రే చంద్రరావు, ముప్పర్తి నాని, దిరిశాల బాలాజీ, సీఈవో తోట జగదీష్, సహకార ఇనస్ట్రక్టర్ ఆదిమూలం వెంకటేశ్వరరావు, పశుసంవర్థకశాఖ జేడీ కె.వెంకట్రావు, ఎస్.వెంకటేశ్వరరావు, డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

రైతులకు ప్రోత్సాహకంగా పలు పథకాలు

మలికిపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతుల ఆదాయాన్ని పెంచడానికి జిల్లా కలెక్టర్ పలు పథకాలు అమలులోకి తీసుకువస్తున్నారని పశుసంవర్థకశాఖ జేడీ కె.వెంకట్రావు అన్నారు. ఫ్యాక్టరీ ధరకే రైతులకు దాణా సరఫరా చేస్తున్నామని జిల్లాలోని 40 సహకార సంఘాల ద్వారా 50 కిలోల దాణాను రూ.1020కు అందజేస్తున్నామన్నారు. వరిగడ్డి మోపులు చుట్టే యంత్రాలను పార్టీ హెచ్‌పీ ట్రాక్టర్ ఉన్న రైతులకు సబ్సిడీపై జిల్లాలో వంద ఇవ్వడానికి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో 186 సంఘాలు ఉన్నాయని, వాటన్నింటికీ దాణా అందుబాటులోకి తెస్తామన్నారు. 15 రోజులు ప్రభుత్వం సరఫరా చేసిన దాణా వాడిన తరువాత పాల దిగుబడిని పరిశీలిచామని, పాల దిగుబడి పెరిగిందని ఆయన అన్నారు. రైతుల వద్ద పాలకు డైరీలలో తక్కువ రేటు వస్తుఉన్నందున పొదుపు సంఘాల ద్వారా పట్టణ ప్రాంతాల్లో స్టాల్స్ ఏర్పాటుచేసి అమ్మకాలు చేపట్టడం ద్వారా రైతుకు మంచి రేటుతో పాటు పొదుపు సంఘాలకు ఆదాయం కూడా వస్తుందని అన్నారు. ఈ సంఘాలకు ఫుడ్ ప్రొసెసింగ్ యూనిట్లు కూడా అందజేస్తామని ఆయన చెప్పారు.

జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచిన పవర్‌కిక్ విద్యార్థులు

అమలాపురం, నవంబరు16(ఆంధ్రజ్యోతి): కాకినాడలో జరిగిన ద్రోణ బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంలో గోల్డెన్ షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో పవర్‌కిక్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు చీఫ్‌కోచ్ పడాల అంజి తెలిపారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో అమలాపురానికి చెందిన క్రీడాకారులు లలిత, ప్రణయ్, కార్తీక్, సుజయ్, ప్రణీత, ప్రేరణ, సునీత్, నందు, కేతన్, దినేష్‌లు ప్రథమస్థానం, జోగేంద్ర, విరాట్, నిఖిల్ ద్వితీయ స్థానాలు సాధించిన పతకాలు, సర్టిఫికెట్లు దక్కించుకున్నారు. ఈ పోటీలకు రిఫరీగా అమలాపురానికి చెందిన చిక్కం సురేష్ వ్యవహరించారు. పతకాలు సాధించారు. 13మంది క్రీడాకారులను పలువురు అభినందించారు.

'గ్రంథాలయాలు వాగ్దేవి నిలయాలు'



గ్రంథాలయ వారోత్సవాల్లో మాట్లాడుతున్న డాక్టర్ కొల్లూరి, భీమనపల్లి గ్రంథాలయంలో..

అమలాపురం టౌన్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు వాగ్దేవి నిలయాలని ప్రముఖ కవి డాక్టర్ ఎస్ఆర్ఎస్ కొల్లూరి పేర్కొన్నారు. గ్రంథాలయ ఉద్యమానికి కృషిచేసిన త్రిమూర్తులు అయ్యంకి వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్, పాతూరి నాగభూషణం పాత్ర అమూల్యమైనదని వివరించారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని అమలాపురం ప్రథమశ్రేణిశాఖ గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ అధికారి జీవీఆర్ఎస్‌హెచ్‌కే వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డాక్టర్ కొల్లూరి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రంథాలయ ఉద్యమానికి సొంత ఆస్తులను, సమయాన్ని, జీవితాలను త్యాగం చేసిన వారి కృషి అద్వితీయమని కొనియాడుతూ వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అద్దంకి అమరేశ్వరరావు, యర్రంశెట్టి ధర్మారావు, పి.చిదానందమూర్తి, వై.ధర్మారావు, కె.చంద్రమౌళి, పోలిశెట్టి సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

గ్రంథాలయ ప్రముఖులకు నివాళి

మామిడికుదురు(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ప్రముఖులు పోతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణలకు ఘన నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడోరోజు ఆదివారం గ్రంథాలయాల అభ్యున్నతికి కృషిచేసిన ప్రముఖులకు నిర్వాహకుడు సూర్యనారాయణ ఆధ్వర్యంలో వారి చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గెద్దాడ లక్ష్మీప్రసన్న, డి.వెన్నెల, జయప్రకాష్, పీడీసీ వై.కన్నబాబు పాల్గొన్నారు.

చిత్రలేఖన పోటీలు

అంతర్వేది(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపాలెంలో మూడో రోజు గ్రంథాలయ ఉద్యమకారులను స్మరించుకున్నారు. అనంతరం చిత్రలేఖన పోటీలకు పర్యవేక్షణాధికారులుగా కె.రాంబాబు, అర్జునుడు వ్యవహరించగా పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ తృతీయ బహుమతులు అందించినట్టు గ్రంథాలయ వైద్యాధికారిణి వై.వెంకటలక్ష్మి తెలిపారు.

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

ఉప్పలగుప్తం(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయ ఉద్యమంలో సేవలందించిన ప్రముఖులు వీఎస్ఆర్ రంగనాధన్, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావులను ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలని ప్రముఖ కవి నల్లా నరసింహమూర్తి అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం భీమనపల్లి గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి అర్పించారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయ సర్వస్వం పత్రిక స్థాపించి గ్రంథాలయాల ఆవశ్యకతను వివరించారన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం గ్రంథాలయాల ద్వారా విద్యార్థులు ఏ విధంగా ప్రయోజనం పొందవచ్చో తెలిపారు. గ్రంథాలయ అధికారి నిమ్మకాయల శేషుకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బీవీవీ సత్యనారాయణ, పి.సుబ్రహ్మణ్యం, బీర సురేష్, కుమారి, గుత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కవి నల్లా నరసింహమూర్తి రచించిన 118వ నడక నానీల పుస్తకాన్ని ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం ఆవిష్కరించారు. గ్రంథాలయ అధికారి సలాది నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిక్కం సాంబశివరావు, సూదా సూర్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం

అమలాపురంరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయిబాబా శతవర్ష జన్మదిన వేడుకల్లో భాగంగా ఆదివారం బండారులంక శ్రీసత్యసాయి సేవాసమితి సక్షం రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. భగవాన్ శ్రీసత్యసాయిబాబా శతవర్ష జన్మదిన మహోత్సవంలో భాగంగా బండారులంక విజ్ఞం స్కూలులో తొలుత పూజలు నిర్వహించారు. అనంతరం ఉచిత మెగా మల్టీస్పెషాలిటీ వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ అభిషేక్‌వర్మ, డాక్టర్ వై.నీలిమ, డాక్టర్ కె.రవికుమార్, డాక్టర్ కె.శ్రీమన్నారాయణ, డాక్టర్ అనంతలక్ష్మీతోపాటు అన్ని విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొన్నారు. ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సేవాసమితి ప్రతినిధులు శిష్టా గుణరంజన్, కొండా కుమార్, ఊటుకూరి సోమరాజు, కొండా చిన్నా, కటకం గిరి, దంగేటి అరుణ్, లక్కింశెట్టి సోమరాజు పాల్గొని సేవలు అందించారు.

'రాజ్యాంగ దినోత్సవ సభను జయప్రదం చేయండి'

మలికిపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈనెల 26న అమలాపురంలో జరిగే రాజ్యాంగ దినోత్సవ సభను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పూలే-అంబేడ్కర్ భవన్‌లో మహ్మద్ షాబా అధ్యక్షతన జరిగిన సభలో మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యేడిద రాజేష్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలు, విశిష్టతల గురించి ప్రతీ పౌరునికి తెలియాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, దీపాటి ప్రసాద్, గెద్దం ఫిలిప్‌రాజు, తోటే ప్రతాప్, విప్పర్తి సాయిబాబా, ముత్యాల శ్రీనివాసరావు, మందా సత్యనారాయణ, రత్నరాజు, సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.


లోక కల్యాణార్థం వేంకటేశ్వరస్వామికి శాంతి కల్యాణం



బండారులంకలో వేంకటేశ్వరస్వామికి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురంరూరల్, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసంలో శివ కేశవులకు బేధం లేదని బండారులంక శ్రీపద్మావతి అలివేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి వైభవంగా శాంతి కల్యాణం జరిపించారు. శ్రీనివాసా బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం నిర్వహించిన శాంతి కల్యాణంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామి-అమ్మవార్లను ఉంచి కల్యాణ క్రతవులు జరిపించారు. స్వామివారి తరఫున అర్చక, పురోహితులు, దేవేరులు తరఫున భక్తులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. యజ్ఞోపవీతధారణ, మంగళసూత్రధారణ వంటి కార్యక్రమాలను వేద పురోహితులు కారుపర్తి మల్లేశ్వరరావు శిష్యబృందం ఆధ్వర్యంలో జరిపించారు. స్వామి-అమ్మవార్లకు కల్యాణ కర్తలు తలంబ్రాలు పోసి తరించారు. అనంతరం భక్తి శ్రద్ధలతో లక్ష దీపోత్సవం నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన ఆదియోగి విగ్రహం ఎదుట విశేష దీపాలంకరణ జరిపారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, అధికార ప్రతినిధి నల్లా స్వామి, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, వైసీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్, దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, ఎంపీటీసీ అంకం హిమభారతి, దంగేటి బుల్లబ్బులు, జానగణేష్, చింతపట్ల బాబు, బిళ్ల విశ్వేశ్వరరావు, అంకం పెదరాజు, చింతా హేమ, పిల్లి పల్లపురాజు, అంకం గిరి, బళ్ల సాయి, లక్కింశెట్టి ఫణిరాజు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన పూజ



శ్రీఉమావల్లభేశ్వరస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

ముమ్మిడివరం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ క్రాపచింతలపూడిలోని శ్రీఉమా వల్లభేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో లక్ష బిల్వార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. బందా కల్యాణ్‌శేఖర్-అనూహ్య దంపతుల ఆధ్వర్యంలో కార్తీకమాసం పురస్కరించుకుని లక్ష బిల్వార్చన పూజ చేశారు. కార్యక్రమంలో బాదంపూడి శ్రీరామచంద్రమూర్తి, సత్తిబాబు, శ్రీగిరి శ్రీనివాసరావుశర్మ, పోచినపెద్ది రామసుబ్రహ్మణ్యం, పెమ్మరాజు వల్లీ, బందా బండకేశ్వరకుమారస్వామి, వడలి పూర్ణయ్య, పెండ్యాల రాజేష్, గన్నవరపు దేవకీనందనరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర లింగార్చన

అంబాజీపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా అంబాజీపేట దీక్షిత్‌నగర్‌లోని ఆదివారం సహస్రలింగార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాడ్రేవు సూర్యనారాయణమూర్తి- సత్యభాను దంపతులు సునర్ల ఫణికుమార్ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అమలాపురానికి చెందిన కోట శ్రీనివాసశర్మ సుందరకాండ పారాయణను నిర్వహించారు. మండలంలోని శైవక్షేత్రాలు కార్తీక ఆదివారం భక్తులతో కిటకిటలాడాయి.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం నాడు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారికి ఐశ్వర్య లక్ష్మీ హోమం, బాలబోగం, గో ప్రదక్షిణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పోటెత్తారు. అధిక సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో దీపాలంకరణ గావించారు. స్వామివారి ప్రసాదంలో భక్తజనం పాల్గొన్నారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు వాటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ర్యాలి కేశవస్వామి ఆలయంలో భక్తుల సందడి

ఆత్రేయపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయా నికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి న భక్తులతో రద్దీ నెలకొంది. స్వామివారికి భక్త జనం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన దండు వెంకట సత్యనారాయణ రాజు, పద్మ దంపతులు, దండు రాజగోపాల్ రాజు, వందన దంపతులు రూ.50,232, రావులపాలేనికి చెందిన పెన్మత్స శిరిచందన రూ.5,116, నర్సాపురానికి చెందిన రుచిత రూ.6,516, ఏలూరుకు చెందిన ఎం.తిరుమల దేవి, రమేష్ దంపతులు రూ.15,000 విరాళాలు ఇచ్చారు. దాతలకు ఈవో రమణమూర్తి స్వామి వారి చిత్రపటం, శేషవస్త్రం, తీర్థ ప్రసాదాలు అందించారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మెట్లపూజ



ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయంలో 18మెట్ల పూజను నిర్వహిస్తున్న దృశ్యం

ఆలమూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలమూరు అయ్యప్పస్వామి ఆలయం వద్ద ఆదివారం రాత్రి స్వామివారి 18 మెట్లపూజను ఘనంగా నిర్వహించారు. తొలుత గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపకుడు పి.ముకుందేశ్వరస్వామి, ట్రస్టు బోర్డు చైర్మన్ వంటిపల్లి సతీష్‌కుమార్ స్వామి అధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన ఆయా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకులు అంగర వేణుగోపాలాచార్యులు, అంగర శింగుబాబు, అంగర భగవాన్‌ల వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా జరిపించారు. అయ్యప్పస్వామి మెట్లపూజను తిలకించడానికి మండలంలోని పలు గ్రామాల నుంచి అయ్యప్ప భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎలుగుబంట్ల బూరయ్యస్వామి, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



గుమ్మిలేరులోని వేంకటేశ్వరస్వామి ఆలయానికి విచ్చేసిన భక్తులు

వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తుల సందడి

ఆలమూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం గుమ్మిలేరులోనున్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం ఆదివారం సందర్భంగా అధికసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. కార్తీకమాసం ఆదివారం సందర్భంగా మండపేట నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మహిళా భక్తులు విష్ణు సహస్ర నామాలు ఆలపించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు రెడ్డి సత్తిబాబు అధ్వర్యంలో వారికి స్వాగతం పలికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలో కొత్తపేట తాలుకా ఏపీఎన్జీవో నూతన కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న దృశ్యం

కొత్త పేట తాలుకా ఏపీ ఎన్జీవో కార్యవర్గ ఎన్నికలు

రావులపాలెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశం హాలులో కొత్తపేట తాలుకా ఏపీఎన్జీవో కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఏపీ ఎన్జీవోస్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అడహాక్ కమిటీ చైర్మన్ మాదవరపు వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల అధికారిగా ముమ్మిడివరం యూనిట్ అధ్యక్షుడు సీహెచ్‌ఎన్‌సీహెచ్ దొర, సహాయ ఎన్నికల అధికారిగా బండారు రాజేష్, పరిశీలకులుగా అడహాక్ కమిటీ కో చైర్మన్ వి.ఏసుబాబు వ్యవహరించారు. ఈ ఎన్నికల ప్రక్రియలో ఒక్కొక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. అధ్యక్షులుగా యేపుగంటి సురేష్ ఎన్నిక జరగగా, వివిధ శాఖల్లో ఉద్యోగులుగా ఉన్నవారు కార్యవర్గ ఎన్నిక జరిగింది. కార్యక్రమంలో కొత్తపేట మాజీ అధ్యక్షులు కొవ్వూరి ప్రభాకర రెడ్డి, మోటూరి రామారావు, మండపేట అధ్యక్షుడు జె.మల్లిఖార్జునుడు, రాజోలు అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, అమలాపురం అధ్యక్షుడు సీహెచ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధనలో ఘర్షణ

ఇరు వర్గాలపై కేసులు నమోదు

ద్రాక్షారామ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం జగన్నాయకులపాలెంలో ఆదివారం శెట్టిబలిజ వర్గీయుల వనసమారాధనలో తలెత్తిన ఘటనలపై ఇరువురి ఫిర్యాదుల మేరకు ద్రాక్షారామ పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం..నర్సిపూడి గ్రామానికి చెందిన పిల్లి వెంకట రామలక్ష్మికి, తాళ్లపొలం గ్రామానికి కట్టా గోవిందుకు ఆస్థిగొడవలు ఉన్నాయి. ఆదివారం జగన్నాయకులపాలెంలో శెట్టిబలిజ సంఘం సమావేశం జరుగుతుందని న్యాయం కోసమని పెద్దలను కలిసేందుకు వెంకట రామలక్ష్మితో పాటు మరికొంత మంది అక్కడకు వెళ్లారని పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో మేడిశెట్టి ఇజ్రాయెల్, కట్టా ప్రియ దుర్గావెంకటేష్, కట్టా సూర్యనారాయణ, మేడిశెట్టి శ్రీను మరికొంత మంది తమపై దాడి చేయడంతో పాటు అసభ్యంగా ప్రవర్తించి తోసేశారని బాధితులు ఫిర్యాదు చేశారన్నారు. వారిచ్చిన ఫిర్యాదుపై ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేశారు.

దౌర్జన్యం చేసి అన్నంలో రాళ్లు వేశారు: మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మరో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగన్నాయకులపాలెంలో ఆదివారం శెట్టిబలిజ వర్గీయుల వనసమారాధన జరుగుతుండగా నర్సిపూడి గ్రామానికి చెందిన పిల్లి వీరమణికంఠ, పిల్లి సునీత, పిల్లి వీరవెంకట సత్యనారాయణ, పిల్లి రామలక్ష్మి, పిల్లి శ్రీనివాసు, పండు రమేష్ మరికొంత మంది బ్యానర్ పట్టుకుని పలు నినాదాలు చేశారన్నారు. భోజనాల గిన్నెలపై మట్టి వంటివి చల్లారని తెలిపారు. కార్యక్రమం జరగనివ్వమని నిర్వాహకులను దూషించారన్నారు. మాజీ ఎంపీపీ కట్టా సూర్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా సహస్ర లింగార్చన

అంబాజీపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా అంబాజీపేట దీక్షిత్‌నగర్‌లో ఆదివారం సహస్రలింగార్చన పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాడ్రేవు సూర్యనారాయణమూర్తి- సత్యభాను దంపతులు నుసర్ల ఫణికుమార్ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు.

కోతకు గురవుతున్నా కనిపించదా ?

• పాలకులపై లంక రైతుల అసంతృప్తి • గోదావరిలోకి కలిసిపోతోందని ఆవేదన

ఆత్రేయపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): వశిష్ఠ, గౌతమి నదీ పరివాహక ప్రాంతాల్లోని ఆయా లంక భూములు ఇటీవలి వరదలకు కోతకు గురవుతూ నదీగర్భంలో కలిసిపోతున్నాయని లంకప్రాంత రైతులు వాపోతు న్నారు. ప్రతి ఏటా సంభవించే వరదలకు గౌతమి, వశిష్ఠ ఏటిగట్టుకు ఆనుకుని ఉన్న ఆయా పంటపొలాలను గోదావరి కబళించేస్తున్నదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. తమ కళ్ల ఎదుటే ఆయా పంట భూములు నదిగర్భంలో కలిసిపోతుండటంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని రైతులు వాపోతున్నారు. రాజవరం, పేరవరం, వెలిచేరు, వసంతవాడ, వద్దిపర్రు తదితర గ్రామాల్లోని పలు లంక భూములు ఇటీవలి వరదలకు కోతకు గురయ్యాయి. కొబ్బరి, అరటితో పాటు ఉద్యాన పంటలు పండించే వందల ఎకరాలు కోతకు గురవడంతో భారీగా నష్టపోతున్నామని వాపోతున్నారు. దీనిపై ఎన్నో ఏళ్ల నుంచి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదల సమయంలో హెడ్‌వర్క్స్ అధికారులు కోతకు గురవుతున్న ప్రాంతాలను పరిశీలించి వెళ్లిపోతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఏ ప్రభుత్వం వచ్చినా నదీకోత నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని లంక రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావును కలిసి నదీకోత నివారణకు చర్యలు చేపట్టాలని కోరినట్టు రాజవరానికి చెందిన రైతులంటున్నారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్, హెడ్‌వర్క్స్ అధికారులకు గ్రొయిన్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారని వారంటున్నారు. నదీకోతకు లంక భూములు గురవకుండా శాశ్వత పరిష్కారం చేపట్టాలని లంక రైతులు కోరుతున్నారు.



పేరవరం వద్ద నదీకోతకు గురవుతున్న లంక భూములు



కొత్తపేటలో ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



కపిలేశ్వరపురం: నేలటూరు వన సమారాధనలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల



రామచంద్రపురంలో ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న కాపు సంఘం నేతలు

ఐక్యతకు వనసమారాధనలు కీలకపాత్ర

ఎమ్మెల్యేలు బండారు, వేగుళ్ల

కొత్తపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): సామాజిక ఐక్యతకు కార్తీక వనసమారాధనలు దోహదపడతాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం బండారు బుల్లిసత్యం చంద్రావతి కాపు కల్యాణ మండపం ఆవరణలో తెలగ అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కాపు వనసమారాధన నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన అన్న సమారాధనలో భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, పాలూరి సత్యానందం, కంఠంశెట్టి శ్రీనివాస్, ధరణాల రామకృష్ణ, మద్దింశెట్టి ప్రసాద్, విళ్ళ వీరమారుతీ ప్రసాద్, అద్దంకి చంటిబాబు, ముద్రగడ సుబ్బారావు, పెనుమాళ్ల అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతకు ప్రతీకలు వనసమారాధనలు

కపిలేశ్వరపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఐకతకు ప్రతీకలుగా కార్తీక వనసమారాధనలు నిలుస్తాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ అన్నారు. ఆదివారం మండలంలోని నేలటూరులో పట్టాభిరామస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల వద్ద ఆలయ కమిటీ చైర్మెన్‌లు గుబ్బల సూర్యనారాయణ, అల్లం శ్రీనివాస్, ఈవో ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో జరిగిన వనసమారాధనలో వారు మాట్లాడారు. కపిలేశ్వరపురంలో కృష్ణదేవరాయ కాపు సంఘం ఆధ్వర్యంలో జరిగిన వనసమారాధనలో ఉసిరిచెట్టుకు పూజలు చేశారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తనయుడు పృథ్వీరాజ్ వన సమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఏఎంసీ మాజీ చైర్మన్ పువ్వల చిట్టిబాబు, ఆయా గ్రామస్థులు, కాపు సంఘం నాయకులు, పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కపిలేశ్వరపురంలో జరిగిన వనసమారాధనలో మాట్లాడుతున్న లీలాకృష్ణ

పడాలవారి వనసమారాధన

రావులపాలెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని పడాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ముందుగా నిర్వహించిన పూజల్లో వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి వారితో పాటు పాల్గొని పూజలు జరిపారు. అనంతరం వనసమారాధన జరిగింది. కార్యక్రమంలో పడాల పరమేశ్వరరెడ్డి, సత్తి సూర్యభాస్కరరెడ్డి, పడాల ప్రసాదరెడ్డి, పోతంశెట్టి వాసు, సత్తి రామకృష్ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాపు సంఘీయుల వనసమారాధన

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో కాపు సంఘీయుల కార్తీక వనసమారాధన జరిగింది. స్థానిక కాపు కల్యాణ మండపంలో జరిగిన కార్తీక వన సమారాధనలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కాపు సంఘం నాయకులు ఉసిరి చెట్టు వద్ద పూజలు చేశారు. అనంతరం కాపు సామాజిక వర్గీయులు కార్తీక భోజనాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్ రాయ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కాపు సంఘం నాయకులు తొగరు బ్రహ్మాజీ, అరిగెల నాగేశ్వరరావు, నాగిరెడ్డి బలరామ్, కంచుమర్తి బాబూరావు, పోతంశెట్టి గోపాలకృష్ణ, సుంకర చినకాపు, కంచర్ల చక్రి, కాపు వర్గీయులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల వనసమారాధన

ద్రాక్షారామ, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎంఎస్ఎన్ చార్టీస్ 1989-91 డిగ్రీ పూర్వ విద్యార్థుల వనసమారాధన ఉత్సాహంగా జరిగింది. పూర్వ విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. కుటుంబ సమేతంగా కార్తీక వన భోజనాలు చేశారు. కార్తీక వనసమారాధన నిర్వాహకులు, ద్రాక్షారామ గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ దంపతులను పూర్వ విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో పి.బాలజీ, కోట శ్రీనివాస్, కొత్తపల్లి రామారావు తదితరులు వీటి ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ద్రాక్షారామలో జరిగిన కార్తీక వనసమారాధనలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ర్యాలిలో తల్లికి గుడికట్టిన కుటుంబ సభ్యులు

అమ్మకు ప్రేమతో...

ఇంటి వద్ద ఆలయం కట్టించిన కుటుంబ సభ్యులు

ఆత్రేయపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద చిన్నపాటి ఆలయాన్ని నిర్మించి అమ్మపై ఉన్న ప్రేమను వారు చాటుకున్నారు. ఆపై అక్కడ దీపాలు వెలిగించి పూజలు చేశారు. మ్యాజిక్ కుటుంబ సభ్యులంతా అక్కడ పూజలు చేసి నివాళులర్పించారు. ర్యాలికి చెందిన ప్రఖ్యాత ఇంద్రజాలకుడు చింతా శ్యామ్‌కుమార్ తన మ్యాజిక్ హౌస్‌లో అమ్మ ఆలయాన్ని నిర్మించి ప్రేమను చాటుకున్నారు. దీన్ని టేక్ కేర్ హోమ్ ద్వారా సహకారం అందుకుంటున్న తల్లుల చేతులు మీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. వేకువ జామునే తన తల్లి అన్నపూర్ణమ్మ విగ్రహం వద్ద సహస్ర జ్యోతులతో అమ్మ అక్షర రూపంలో జ్యోతులు వెలిగించారు. ఆమె జీవితంపై రూపొందించిన పాటలను ఆదివారం ఆవిష్కరించి విగ్రహావిష్కరణ చేశారు. శ్యామ్ మాట్లాడుతూ తన చిన్నతనంలో అమ్మ, నాన్నలతో ర్యాలి గ్రామం వచ్చామన్నారు. తమ ఉన్నతికి అమ్మ పెంపకమే కారణమన్నారు. కోవిడ్ సమయంలో పేదల ఆకలి తీర్చడంతో పాటు వైద్య సేవలందించడంలో ఆమె ఎంతో సహకరించారన్నారు. ఆమె సేవ శాశ్వతంగా ఉండాలనే సంకల్పంతో చిన్నపాటి ఆలయాన్ని నిర్మించి రోజూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే లక్ష్యంతో దీన్ని రూపొందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో తండ్రి సూర్యచంద్రరావు, మ్యాజిక్ ఫ్యామిలి సభ్యులు డాక్టర్ మోహిత్, సీత, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కపిలేశ్వరపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దివంగత గ్రంథాలయ పితామహ అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు సేవలను స్మరించుకున్నారు. అనంతరం జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సర్పంచ్ సాకా శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో హిందీ టీచర్ రామలక్ష్మణరాజు, రిటైర్డ్ ఉపాధ్యాయులు చిట్టూరి సత్యనారాయణ, గ్రంథాలయాధికారిణి దానేటి శివకుమారి, గ్రంథాలయ పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ శ్రీనివాస్

గ్రంథాలయ పితామహుడికి నివాళి

ఆత్రేయపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మూడవ రోజు ఆదివారం గ్రంథాలయ ఉద్యమానికి విశేష సేవలు అందించిన పితామహుడు అయ్యంకి వెంకటరమణ చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, సేవలను వారు కొనియాడారు. గ్రంథాలయాధికారిణి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో రచయితల కవి సమ్మేళనం నిర్వహించారు. ముళ్ళపూడి భాస్కరరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ కార్యదర్శి మారిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు స్వీట్లు, అల్పాహారం అందజేశారు. ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో తంబా నమ్మశివాయ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించారు.

అగ్నిప్రమాద బాధితులకు యూటీఎఫ్ చేయూత

ఆత్రేయపురం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మెర్లపాలెం ప్రాథమిక పాఠశాల ప్రాంతంలో జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిల్లు దగ్ధమయ్యాయి. యూటీఎఫ్ సామాజీక సేవలో భాగంగా ఒక్కొక్క కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు, దుప్పట్లు, ఆర్థికసాయం అందించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.2500 విలువైన సామగ్రిని అందజేశారు. ఉపాధ్యాయరాలు టి.రామకృష్ణ, ఎం.లక్ష్మి ఆయా కుటుంబాలకు ఆర్థికసాయం అందచేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్యోతిబసు, డైరక్టర్ ప్రసాద్, అధ్యక్ష, కార్యదర్శులు సుధాకర్ పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం



పుస్తకావిష్కరణ నిర్వహించిన దృశ్యం

'చిరుదివ్వెలు గెలిగిద్దామా'

పుస్తకావిష్కరణ

ఆలమూరు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): దేశభక్తి, మానవ సంబంధాల పట్ల ప్రేమ, జీవన నైపుణ్యాలు అలవర్చుకోవడం ద్వారా ధార్మిక జీవనం సాధ్యమవుతుందని కవి, అంగర లక్ష్మికాంతం ఎడ్యుకేషన్ ట్రస్టు వ్యవస్థాపకుడు కృష్ణశ్రీ అన్నారు. ఆలమూరు జనార్దనస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన రచించిన చిరుదివ్వెలు వెలిగిద్దామా పుస్తకావిష్కరణ నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ భైరిశెట్టి రాంబాబు దీన్ని ఆవిష్కరించారు. కవి కృష్ణశ్రీ మాట్లాడుతూ ఇటీవల పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గిందన్నారు. ముఖ్యంగా చిన్నారులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇందులో భాగంగానే ఈ పుస్తకాన్ని ఆవిష్కరించామన్నారు.

ఘనంగా వైఖానస సంఘ కార్తీక వన సమారాధన: మండల వైఖానస సంఘం అధ్వర్యంలో ఆదివారం ఆలమూరు జనార్దన స్వామి ఆలయ ఆవరణలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. వైఖానస కుటుంబసభ్యులు హాజరై పూజలు నిర్వహించారు. అనంతరం కార్తీక వనసమారాధనలు జరిగాయి. కార్యక్రమంలో వైఖానస సంఘ నాయకులు సత్తిపండు, కృష్ణ, మోదుకూరు శ్రీను, చిన్న, భగవాన్, సూర్యనారాయణ, సత్తిబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

పంట కోసిన వారిపై

కేసు నమోదు

కె.గంగవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పామర్రు గ్రామంలో కోర్టు వివాదంలో ఉన్న భూమిలో పంట కోసిన వారిపై కేసు నమోదు చేసినట్టు పామర్రు ఎస్ఐ ఎస్.కె. జానీబాషా చెప్పారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యాల మెహర్ బాబాకు చెందిన మూడున్నర ఎకరాలు వ్యవసాయ భూమి కోర్టు వివాదంలో ఉంది. దీనిపై మెహర్ బాబాకు ఇంజక్షన్ ఆర్డర్ ఉంది. ఈ భూమిలోని పంటను కె.నాగమోహన్‌రావు వ్యక్తులు ఆదివారం పంటను కోశారు. దీనిపై మెహర్‌బాబా ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జానీబాషా తెలిపారు.



వెదురుపాకలో అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా అయ్యప్పస్వామి

గ్రామోత్సవం

రాయవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెదురుపాక గ్రామంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. గ్రామానికి చెందిన కడియాల వెంకటరమణ గురుస్వామి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలుత అయ్యప్పస్వామి విగ్రహాన్ని రథంపై ఉంచి పూజలు, హారతులు నిర్వహించారు. గ్రామానికి చెందిన 40 మంది అయ్యప్పమాలధారులు వినాయకుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, అయ్యప్పస్వామి భజనలతో గ్రామోత్సవం జరిపారు. అయ్యప్పమాలధారులు అయ్యప్పపాటలకు అనుగుణంగా పేటతుళ్లి ఆడారు. అయ్యప్పస్వామి రథోత్సవం సందర్భంగా భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి హారతులు ఇచ్చారు. కార్యక్రమంలో అయ్యప్పమాలధారులు, గ్రామస్థులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

కల్యాణోత్సవాలు ప్రారంభం



హోమం నిర్వహిస్తున్న పండితులు

కపిలేశ్వరపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అంగర, పడమరఖండ్రిక గ్రామాల్లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉదయం కె.సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో సంకల్పం నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, వేదమంత్రాలతో పంచకోటి అక్షరగ్రంధములతో ఆలయ ప్రవేశం, భూతబలి, గణపతి పూజ తదితర పూజలను జరిపారు. మధ్యాహ్నం లక్షబిల్వార్చన, సువాసినీలచే కుంకుమార్చన, రుద్రహోమం, పూర్ణాహుతి, జ్యోతిర్లింగార్చన, తదితర పూజలను నిర్వహించారు. మంగళవారం ఆలయ ప్రాంగణంలోని తులసి, ఉసిరి చెట్టుకింద కార్తీక వనసమారాధన నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపారు. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక, గ్రామస్థులతో పాటు మహిళలు, భక్తులు, ఆలయ అభివృద్ధి, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.